

### శ్రీవారికి మైసూరు రాజమాత

## అఖండ వెండిదీపాలు కానుక

తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి : ఏడుకొండలవేంకటేశ్వరస్వామి ఆనందనిలయంలో గర్భగుడిలో నిరంతరాయంగా వెలిగే వెండి అఖండదీపాలను మైసూరురాజమాత ప్రమోదాదేవి కానుకగా ఇచ్చారు. సుమారు 300 సంవత్సరాల క్రిందట అప్పటి మైసూరుమహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించారు. మళ్ళీ సోమవారం రాజమాత గర్భగుడిలో అఖండదీపాలను అందజేశారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


### ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు

తిరుపతి కలెక్టరేట్, మే 19 ప్రభాతవార్త ః




వాట్సాప్ మన మిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అని స్టాండ్స్‌ను సచివాలయం సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అందజేశారు. జిల్లాలోని 691 సచివాలయాలకు ఈ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జీఎస్‌డబ్లూ అధికారి జీవి. నారాయణరెడ్డి, జీఎస్ డబ్లూఎస్ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చక్రస్నానం



## ముగిసిన కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, మే 19 ప్రభాతవార్త : నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం చక్రస్నానంతో ముగిసాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు పల్లకీలో నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సలు ధ్వజావ రోహణంతో ముగిసాయి. భక్తులు అడుగడుగునా టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం పల్లకీలో అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగుతూ తామరగుంట పుష్కరిణీకి తీసుకెళ్లారు. తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు,



నెయ్యి, తేనే, కొబ్బరినీళ్లు, పశుపు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం తామరగుంట పుష్కరణీలో శ్రీవారికి సుదర్శన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు చక్రస్నాన వేడుకలను తిలకించడానికి తరలివచ్చారు. దీంతో తామరగుంట పుష్కరణీ భక్తులతో నిండిపోయింది. భక్తుల గోవిందనామా స్మరణతో పుష్కరిణి కళ కళలాడింది. అంతుకుముందు వేదపండితులు వేదమంత్రాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, సిఐ రవీం ద్ర, ఎస్‌ఐలు రాజశేఖర్, ఓబయ్య, వేంకటేశ్వర్లు, ఎఎస్‌ఐలు, సిబ్బంది, టిటిడి విజిలెన్స్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు,

### శ్రీవారి భక్తులకు

# రుచికరమైన భోజనం!

**కొండపై సరసమైన ధరలకే కార్పొరేట్ హోటళ్ళు**

**స్విమ్స్,బర్డ్ ఆస్పత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు**

**-నేడు టిటిడి బోర్డు సమావేశం**



తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు మరింతగా రుచికరమైన భోజనం అందించేందుకు టిటిడి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా భక్తులకు నాణ్యమైన రుచికరమైన ఆహారం తయారుచేసి వడ్డించేందుకు వీలుగా గుర్తింపు ఉన్న ప్రముఖ హోటళ్ల నిర్వాహకులకు టెండర్లు ఇవ్వాలని నిర్ణయించారు.పలు క్యాంటీన్‌లకు టెండర్లు పిలవనున్నారు. తిరుమలలో మఠాల ఆక్రమణలపై, అక్రమాలపై సర్వే రిపోర్టు ఆధారంగా పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తిరుపతిలో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్న స్విమ్స్ ఆస్పత్రి అభివృద్ధికి కూడా నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం ఉదయం తిరుమలలో టిటిడి బోర్డు సమావేశం కానుంది. తులాభారంలో అక్రమాలపై కూడా నేడు బోర్డు చర్చించే అవకాశం ఉంది. టిటిడి బోర్డు నేటి కీలక సమావేశంలో పలు సంచలన నిర్ణయాలు తీసుకునేలా ఉందని సమాచారం.

### ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ

# అగ్నిగుండ ప్రవేశం

**పోటెత్తిన భక్తులు..**



కుప్పం, మే 19 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి కూతవేటు దూరంలో పాత పోలీస్ క్వార్టర్స్ ఉన్న స్థలంలో గుండంను ఏర్పాటుచేశారు. మొక్కులు కలిగిన భక్తులు నిప్పుల కణికలు తొక్కుతూ అమ్మా గంగమ్మా కాపాడమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయం వద్ద, అగ్నిగుండం వద్ద పోటెత్తారు. అగ్నిగుండం వీక్షించుటకు గాను భక్తులకు అసౌకర్యం కలగకుండా పెద్ద ఎత్తున బ్యారికేడ్లను ఏర్పాటుచేశారు. తొలుత పచ్చిగెరిగను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం శ్రీ ముత్తుమారెమ్మ అమ్మవారి కళ్లకు తెర తొలగించిన అనంతరం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఉదయం పాతపేటలోని పెద్దబావి వద్ద గంగపూజ చేపట్టారు. మధ్యాహ్నం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంప్రదాయ బద్ధంగా అగ్నిగుండంకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి గుండంను వెలిగించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

# అమ్మను చూడాలని వెళుతూ...!

**అనంత లోకానికి యువకుడు-శోకసంద్రమైన లద్దిగం**

సోమల(చౌడేపల్లి), మే 19 ప్రభాతవార్త

అమ్మను చూడాలని స్కూటర్‌పై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా సోమల మండలంలోని పంచాయతీ కేంద్రం లద్దిగంకు చెందిన శంకర కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. అతనికి కుమారుడు సందీప్(21), కుమార్తె వున్నారు. 15యేళ్ళ క్రితం కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా శంకర అతని భార్య పుష్పలు విడిపోయారు. ప్రస్తుతం పుష్ప పీలేరులో వుంటోంది. ఈక్రమంలో అమ్మను చూడాలనుకొని సందీప్ టూవీలర్‌పై బయలుదేరాడు. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో బంగ్లా పెద్దచెరువు వద్ద గల మలుపులో స్కూటర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో తీవ్ర గాయాలతో సందీప్ రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని చుట్టుపక్కల వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మార్గమధ్యలోనే సందీప్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సోమల పోలీసులు కేసు నమోదు చేసకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**శోకసంద్రంలో లద్దిగం :**

ఇప్పటి వరకు గ్రామంలో కలియతిరిగిన సందీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం తెలిసిన వెంటనే లద్దిగం శోకసంద్రమైంది. కూలీ పనులు చేసుకొంటూ పిల్లల కోసమే జీవిస్తున్న తండ్రి శంకర్‌కు ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో అతని రోధనలు సైతం కంట తడి పెట్టించింది.

# అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 257 అర్జీలు**



తిరుపతి కలెక్టరేట్, మే 19 ప్రభాతవార్త ః ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో అర్ధవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో వచ్చిన అర్జీదారులకు తాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలను తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌కు 257 మంది అర్జీదారులు వారి బాధలను కలెక్టర్, డెప్యూటీ కలెక్టర్లు, డీఆర్వోలకు అందజేసి వారి బాధలను చెప్పుకున్నారు. సకాంలో అర్జీదారుల సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు చెప్పడంతో వారు సంతోషంగా వెళ్ళారు.

# సత్వరం సమస్యలు పరిష్కారానికి చర్యలు

**- జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి**

చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త: ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మిలు, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించాలన్నారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి



అధికారులు శ్రద్ధ చూపించాలన్నారు.

**పిజిఆర్ఎస్‌కు 256 అర్జీలు**

కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 256 అర్జీలు అందాయి. పరిష్కరించడానికి చర్యలుతీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యధికంగా రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి 198 అర్జీలు అందాయి. అలాగే పోలీసు శాఖ 13, డిఆర్‌డిఎ 11, విద్యుత్‌శాఖ 7, పౌరసరఫరాల శాఖ 7, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, వాటర్ రిసోర్స్ 4, పశుసంవర్ధకశాఖ 2, విద్యా శాఖ 2, పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయం 1, డిసిసిబి బ్యాంకు 1 సమస్యలు అందాయి.

### రేపు కుప్పంలో

# సిఎం చంద్రబాబు పర్యటన

కుప్పం, మే 19 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 21న కుప్పంలో పర్యటించనున్నారు. ఈమేరకు అధికారిక షెడ్యూల్ ఖరారైంది. 21న ఉదయం 10.30గంటలకు విజయవాడనుంచి బయల్దేరి 11.50 గంటలకు బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.30గంటలకు ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.50గంటలనుంచి 1.30గంటల దాకా కుప్పంలో శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 1.40గంటలకు ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్ చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు ద్రవిడ వర్సిటీనుంచి హెలి కాప్టర్‌లో బెంగళూరు చేరుకుంటారు. సాయంత్రం 5గంటలకు విమానంలో విజయవాడకు చేరుకుంటారు.

**జిల్లా కలెక్టర్‌చే సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన**



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 21వతేది సిఎం చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్‌లో బారికేడింగ్ ఏర్పాట్లు, శానిటేషన్ పనులపై చర్చించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎఎస్పీ నంద కిషోర్, ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎస్పీలు పార్థసారథి, మహబూబ్ బాషా, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, గంగమ్మ గుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర పాల్గొన్నారు.

# యువికతోనే యంగ్ సైంటిస్టులు వెలుగులోకి

శ్రీహరికోట (తడ), మే 19 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ యువికా పేరుతో యువ శాస్త్రవేత్తలను తయారు చేస్తున్నారు. 2025లో కూడా ఈ కార్యక్రమం సోమవారం నుంచి మొదలైంది. శ్రీహరికోటతో పాటు మరో ఆరు ఇస్రో కేంద్రాల్లో ఒక్కొక్క చోట 50 మంది చొప్పున ఎంపిక చేసిన యువకులకు ఈ నెల 30 దాకా శిక్షణ ఇచ్చే కార్యక్రమం ఇది. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం, త్రివేంద్రంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, ఇస్రోలోని యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్, ఇతర ముఖ్య ఇస్రో కేంద్రాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, అధికారులు ఈ యువ శాస్త్రవేత్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వర్చువల్ ద్వారా సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# దేవతామూర్తుల దివ్యదర్శనం .. వేయి జన్మల పుణ్యఫలం

**ముగిసిన కల్యాణ వెంకన్న వార్షిక వసంతోత్సవాలు**





చంద్రగిరి, మే 19 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వార్షిక వసంతోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి 8.30 నుండి 9 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులతో పాటు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపుచేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 గంటల నుండి సాయంత్రం 3.30 గంటల వరకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యం, స్నపనతిరుమంజనం నిర్వహిం చారు. చక్రధార, శంఖధార, సహస్రధార, మహోకల శాభిషేకాలను వైఖాసన ఆగామోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రములు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్యప్రభంధనంలో అభిషేక సమయంలో అనుసంధానం చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఇందులో ఒక్కోక్రతువులో ఒకమాల వంతున మొత్తం 7 రకాల కురువవేరు, వట్టివేరు, రోజా, మల్లె, సంపంగి, గులాబి, దవణం, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. వసంత రుతువులో లభించే వివిధరకాల సుగంధభరిత పుష్పాలు, ఫలాలును సమర్పించి స్వామి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్ధమని అర్చకులు తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు ఊంజల్‌పై సేదదీరారు. తదుపరి భక్తుల గోవింద నామస్మరణల నడుమ వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ వి.రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆనంబట్టు ధనశేఖర్, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# తవణంపల్లె మండల వైస్ ఎంపీపీ-2గా అనుసూయమ్మ ఎన్నిక

**తవణంపల్లె, మే 19 ప్రభాతవార్త:** మండలంలో ఖాళీగా వున్న వైస్ ఎంపీపీ-2 గా చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పి.అనుసూయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఎంపీపీగా పనిచేస్తున్న గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు గీత ఇటీవల ఆపదవి నుండి తప్పుకోవడంతో మండల వైస్ ఎంపీపీ-2గా పనిచేస్తున్న మల్లకుంట ఎంపీటీసీ సభ్యుడు పట్నం ప్రతాప్‌రెడ్డి ఎంపీపీగా ఎన్నికయ్యారు. దీనితో మండలంలో వైస్ ఎంపీపీ-2 పదవి ఖాళీ అవడంతో పదవి ఎన్నిక కోసం ఎన్నికల అధికారులు శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి డీపీఓ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులు వుండగా అందులో 14 మంది వైకాపా, ఒకరు టీడీపీ సభ్యులు వున్నారు. అయితే సోమవారం జరిగిన వైస్



ఎంపీపీ ఎన్నిక సందర్భంగా 14 మంది వైకాపా సభ్యులకు గాను ఎనిమిది మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీనితో మండల పార్టీ నిర్ణయం మేరకు చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పి.అనుసూయమ్మను వైస్ ఎంపీపీ-గా ఎన్నుకునేందుకు మోదలపల్లె ఎంపీటీసీ సభ్యుడు ఐరాల ధనంజయరెడ్డి ప్రతిపాదించగా మిగిలిన సభ్యుల చేతులు ఎత్తి ఆమెను బలపరుస్తూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఎన్నికల అధికారి సుధాకర్‌రావు అనుసూయమ్మను వైస్ ఎంపీపీ-2గా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ డిక్లరేషన్‌ను అందజేసి ఆమె చేత ప్రమాణ సీ ్వకారం చేయించారు. దీనితో వైకాపాకు చెందిన వైస్ ఎంపీపీ-2 పదవిని తిరిగి వైకాపా నిలబెట్టుకుంది. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్రరాజు, ఏఓ రెడ్డిబాబు, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా మండలంలో వైకాపాకు 14 మంది ఎంపీటీసీ సభ్యులు వుండగా ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ వైస్ ఎంపీపీ ఎన్నికకు 8 మంది సభ్యులు మాత్రమే హాజరు కాగా తవణంపల్లె, ఎగువ తవణంపల్లె, ఎగువ తడకర, దిగువమాఘం, అరగొండకు చెందిన వైకాపా ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. నూతనంగా వైస్ ఎంపీపీగా ఎన్నికైన అనుసూయమ్మను మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఘనంగా సత్ క్రరించారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి, ఎంపీపీ పట న్నం ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు ఎంపీటీసీ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**గంగవరం, మే 19, ప్రభాతవార్త:** గంగవరం మండలం కీలపల్లె పంచాయితీలోని పొన్నమాకులపల్లె గ్రామ దళితుల ఆలయ ప్రవేశం అడ్డుకున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డి.వి మునిరత్నం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదిన గ్రామంలో నిర్మించిన చెన్నకేశవ స్వామి దేవాలయంలో గ్రామస్తులతో ఆదే గ్రామానికి చెందిన దళితులు పూజసామాగ్రితో పూజలు నిర్వహించడానికి వెళ్లగా బిసి సామాజిక వర్గానికి చెందిన 15 మంది అడ్డుకుని పూజలు నిర్వహించనివ్వకుండా ఆలయం నుండి పంపివేయడం జరిగిందన్నారు. దళితులపై వివక్షతో ఆలయం నుండి వెళ్లగొట్టిన వారిపై తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో నేటికి ఇలాంటి సంఘటనలు జరుగుతునప్పటికి ప్రభుత్వం, అధికారులు ప్రేక్షకపాత్ర వహిసున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మానవ హక్కుల నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం అవ్వపై దాడి



**గంగవరం, మే 19 ప్రభాతవార్త:** ఆస్తి కోసం అవ్వపై మునిమనవడు దాడిచేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన మండలంలోని సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని కీలపట్ల పంచాయితీ గాంధీనగర్‌కు చెందిన కమలమ్మ(85)ను ఆస్థి కోసం మనవడు సుబ్రమణ్యం అతని భార్య అములు దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. ఎంతటికి ఆమె సహకరించక పోవడంతో మునిమనవడు మహేంద్ర తీవ్ర ఆగ్రహంతో ఆమెపై కత్తితో తీవ్రంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కమలమ్మను స్థానికులు పలమనేరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స ఆనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



**సదుం, మే 19, ప్రభాతవార్త** కారు, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడ్డ సంఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు పుంగనూరుకు చెందిన మోహన్ కుమార్, హేమచంద్ర బైక్ పై వస్తుండగా గొంగివారిపల్లె సమీపంలోని ఓ హోటల్ వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరూ గాయపడగా 108 వాహనంలో చికిత్స కోసం పీలేరుకు తరలించారు.

# జనసేన బలోపేతానికి కార్యకర్తలే సైన్యం

### – పగడాల రమణ

**పుంగనూరు, మే 19, ప్రభాతవార్త**



ప్రజాభిమానం చూరగొన్న జనసేన పార్టీకు కార్యకర్తలే ప్రధాన సైన్యమని జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి పగడాల రమణ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జనసేన కార్యకర్తకు పార్టీ భరోసా ఇస్తుందని, వారి జీవితాలకు పవన్ కళ్యాణ్ అండగా నిలబడతారన్నారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి సోమవారం పార్టీ కార్యాలయం లో జిల్లా కార్యదర్శి పగడాల రమణ కిట్లను వాలంటీర్లకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సభ్యత్వం నమోదు కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు జనసేన లీగల్ సెల్ శ్రీనివాసులు, జనసైనికులు, వీర మహిళలు, జనసేన నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లె ఎంపీడీఓగా హరిప్రసాద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



**తవణంపల్లె, మే 19 ప్రభాతవార్త:** తవణంపల్లె మండల రెగ్యులర్ ఎంపీడీఓగా టి.హరిప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఎన్.రెడ్డిబాబు గత అక్టోబర్ 14 నుండి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తు ఈనెల 1న ఆ బాధ్యతల నుండి తప్పుకోవడంతో మండల ఈఓపీఆర్డీ జి.రాఘవేంద్రరాజు డిప్యూటీ ఎంపీడీఓ హోదాలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈనేపథ్యంలో అన్నమయ్య జిల్లా పెనగలూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా వున్న టి.హరిప్రసాద్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై తవణంపల్లె ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన సోమవారం తవణంపల్లె రెగ్యులర్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ మండల అభివృద్దికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## తవణంపల్లె వైకాపా ఎంపీటీసీ సభ్యుడు బాబు రాజీనామా

### –మండల వైకాపాలో లుకలుకలు



**తవణంపల్లె, మే 19 ప్రభాతవార్త:** మండలంలో సోమవారం జరిగిన వైస్ ఎంపీపీ-2 ఉప ఎన్నిక నేపథ్యంలో అసంతృప్తితో వైకాపాకు చెందిన తవణంపల్లె ఎంపీటీసీ సభ్యుడు గాండ్ల బాబు తన ఎంపీటీసీ పదవికి సోమవారం రాజీనామా చేశారు. మండల ఎంపీపీగా పనిచేస్తున్న గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు గీత ఇటీవల ఆపదవి నుండి తప్పుకోవడంతో మండల వైస్ ఎంపీపీ-2గా పనిచేస్తున్న మల్లకుంట ఎంపీటీసీ సభ్యుడు పట్నం ప్రతాప్‌రెడ్డి ఎంపీపీగా ఎన్నికకావడంతో ఖాళీ అయిన వైస్ ఎంపీపీ-2 పదవికి ఉప ఎన్నిక అనివార్యం కావడంతో సోమవారం ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనేపథ్యంలో మండలంలో వైకాపాకు అత్యధికంగా 14 మంది సభ్యులు వుండడంతో ఇందులో పలువురు ఈపదవి కోసం పోటీ పడ్డారు. ఈమేరకు తవణంపల్లె ఎంపీటీసీ సభ్యుడు గాండ్ల బాబు, చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పి.అనుసూయమ్మ, పుణ్యసముద్రం ఎంపీటీసీ సభ్యుడు దేవిడ్‌లు ఈపదవి దక్కించుకోవాలని తమ వంతు ప్రయత్నాలు సాగించారు. అయితే మండల వైకాపా పార్టీ నాయకులు చెర్లోపల్లె ఎంపీటీసీ సభ్యురాలు అనుసూయమ్మను ఎంపిక చేయడంతో పార్టీపై అసమ్మతితో తవణంపల్లె ఎంపీటీసీ సభ్యుడు గాండ్ల బాబు తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని ఆయన సోమవారం ఎంపీడీఓ రాఘవేంద్రరాజుకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపాలో బిసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తూ తదుపరి కార్యాచరణను తెలియజేస్తామని తెలిపారు. ఇదిలా వుండగా మండలంలో వైకాపాకు 14 మంది ఎంపీటీసీ సభ్యులు వుండగా ప్రతిష్టాత్మకంగా సోమవారం జరిగిన వైస్ ఎంపీపీ ఉప ఎన్నికకు కేవలం ఎనిమిది సభ్యులు మాత్రమే హాజరై మిగిలిన ఆరు మంది సభ్యులు గైర్హాజరవడం పట్ల మండల పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి.

## శ్రీపాలేటమ్మ జాతరకు ఏర్పాట్లు ప్రారంభం



**ఐరాల, మే 19 ప్రభాతవార్త:** మండల కేంద్రం ఐరాల గార్గేయనది ఒడ్డున వెలసిన శ్రీపాలేటమ్మ జాతర ఏర్పాట్లును సోమవారం ప్రారంభించారు. ఆలయ వంశపారం పర్య ధర్మకర్త ఎంకె.బాలాజి ఆధ్వర్యంలో ప్రతి ఏటా పాలేటమ్మ జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఈఏడాది ఆలయంలో ఈనెల 27,28 తేదీల్లో జాతర జరుగనుం డడంతో ఏర్పాట్లును సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ముత్తైదువులచే జాతర ఏర్పాట్లుకు పూజలు నిర్వహించి తొలి గుంజ నాటారు. అలాగే రాత్రి అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించి జాతర చాటింపు వేశారు. ఈకార్యక్రమంలో ఆలయ వంశపారపర్య ధర్మకర్త ఎంకె.బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ .



**కాణిపాకం, మే 19 ప్రభాతవార్త:** గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని ఆపార్టీ పూతలపట్టు నియోజకవరగ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ కొత్తపల్లె శివప్రసాద్ అన్నారు. సోమవారం కాణిపాకంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీకి వెన్నెముక క్రియాశీలక సభ్యులని, భవిష్యత్తులో రెట్టింపు స్థాయిలో క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేస్తామని తెలిపారు. ఈమేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఈకిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏపీ.శివయ్య, ప్రధాన కార్యదర్శి తులసిప్రసాద్, జాయిర్ సెక్రటరీలు నెహ్రూ రాయల్, ఎం.మహేష్‌స్వేరో, నాయకులు పురుష్తోతం, కుమార్, శివ, బాలు, మనోహర్, శాంతమూర్తి, తులసి చిన్నా, ఉదయ్ తదతరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 35ఎ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులకు శిక్షణ



***చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:*** చిత్తూరు పట్టణం ఆంధ్రా బెటాలియన్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 35ఎ బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో విద్యార్థులకు 10 రోజుల శిక్షణా కార్యక్రమంను ప్రారంభించినట్లు కమాండింగ్ ఆఫీసర్ ఎన్‌వి మోనిష్, ఏఓ లోకనాధంలు తెలిపారు. శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఉదయం యోగా, డ్రిల్, వ్యాయామ తరగతులతో పాటు ఫైరింగ్‌లో శిక్షణ క్లాసులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఫైరింగ్ రేజ్ నందు ఫైరింగ్ చేయించడం, మ్యాప్ రీడింగ్ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికార్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, చిరంజీవి, ధనంజయులు, యుగంధర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



**చిత్తూరురూరల్, మే 19 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జూన్ 5న విజయవాడలో నిర్వహించు 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు సంబంధించి ఛలో విజయవాడ గోడపత్రికను సంఘ జిల్లా అధ్యక్షుడు పూర్ణం, సెక్రటరీ గిరిధర్, కోశాధికారి కత్తిసురేష్ బాబులు ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణలు హాజరవుతారనీ, ఉద్యోగులు సమస్యలు, రావలసిన రాయితీలు, బకాయిలు తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు జగదీష్‌బాబు, నాగరాజు, హరి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థిపై దాడి దారుణం

### –వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి శ్యామ్

**పలమనేరు, మే 19 ప్రభాతవార్త:** తిరుపతిలో దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిపై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ సహాయ కార్యర్శి శ్యామ్‌సుందర్ రాజ్ డిమాండ్ చేశారు. ఇటీవల తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఓ కళాశాలలో బిటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌పై అధికార పార్టీ అండతో ఆదే కళాశాలలో చదువుతున్న మరో విద్యార్థి రౌడీలతో దాడిచేసి గాయపరచడం దారుణమన్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి బాధితుడి ఫిర్యాదును పరిశీలించి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించాలని రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలకు కళ్ళెం

**గుడిపాల, మే 19 ప్రభాతవార్త:** స్వయం సహాయక సంఘాల డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలకు కళ్ళెం పడింది. డ్వాక్రా సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొంది సకాలంలో తిరిగి చెల్లించిన సభ్యులకు బ్యాంకులు మళ్ళీ రుణాలు మంజూరు చేస్తాయి. అయితే గత రెండు నెలలుగా వెలుగు అధికారులు డ్వాక్రా సంఘ మహిళలకు కొత్త రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకులకు ప్రతిపాదనలు పంపకపోవడంతో బ్యాంకులు వీరికి రుణాలు మంజూరు చేయని పరిస్థితి నెలకొంది. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా పొదుపు చేసుకునే వారికి ప్రభుత్వం మూడు రకాల రుణాలు మంజూరు చేస్తోంది. డ్వాక్రా సంఘ సభ్యులు ఒక గ్రామ సమాఖ్య పరిధిలో స్త్రీ నిధి, విఓ, బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సహాయం పొంది తీసుకున్న రుణంను వాయిదా పద్దతిలో సక్రమంగా చెల్లించాల్సి వుంటుంది. మండల పరిధిలో బ్యాంకు లింకేజీ రుణాలు పొంది పూర్తిగా రుణాలు తిరిగి చెల్లించి రెండు నెలలు కావస్తున్నప్పటికీ వెలుగు అధికారులు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకులకు ప్రతిపాదనలు పంపలేదు. ఫలితంగా డ్వాక్రా సంఘ సభ్యులు సకాలంలో డ్వాక్రా రుణం వస్తుందని భావించిన వారి ఆశ ఆడియాశ అయ్యింది. మండల పరిధిలో సుమారు 800 డ్వాక్రా సంఘాలు వున్నాయి. డ్వాక్రా సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీ కింద రుణం పొంది తిరిగి సకాలంలో చెల్లించిన అత్యధిక సంఘాలకు బ్యాంకులు రెండు నెలలుగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయని పరిస్థితి నెలకొంది. వెలుగు అధికారులు ఆడిటింగ్ యాప్‌ల అప్‌డేషన్, ఆన్‌లైన్ సర్వర్లు పని చేయడం లేదని రుణాలు మంజూరుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా వెలుగు అధికారులు రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాలకు సకాలంలో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా వుంది.

## లోటు బడ్జెట్‌లోను ఎన్నికల హామీలు అమలు

**గుడిపాల, మే 19 ప్రభాతవార్త:** రాష్ట్రం లోటు బడ్జెట్‌లో వున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందని తెలుగుదేశం అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్లు మంజూరు, ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ పథకాలు అమలు చేస్తుండగా తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి తేదీలు ఖరారు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అతి తక్కువ సమయంలో అమలు చేసిన ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కిందని ఆయన పేర్కొన్నారు.

## తహసిల్దార్ సేవలు అభినందనీయం



**పూతలపట్టు, మే 19, ప్రభాతవార్త** పూతలపట్టు మండల తహసిల్దార్ రమేష్ బాబు సేవలు అభినందనీయమని మండల ప్రజలు కొనియాడుతున్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల రూపంలో వినతిస్వీకరించి దాని పరిష్కారాన్ని అక్కడే చూపుతూ వీఆర్వోలని సర్వేయర్లని ఎప్పటికప్పుడు ఆ అర్జీ తాలూకు సమస్య ఏమైందని తెలుసుకుంటూనే క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడే పరిష్కార మార్గాన్ని చూపుతున్న తహసిల్దార్ సేవలు అమోఘమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాసిల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్ధిదారులు చాలా త్వరగా రేషన్ కార్డులో పేరు ఎక్కించుకోవడం లేదా కొత్త కార్డుకి దరఖాస్తు చేసుకోవడం కార్డులో నుంచి చనిపోయిన వారిని తీయించడం లాంటి వాటిని చాలా త్వరగా మీ గ్రామ వార్డు సచివాలయంలో సేవలందిస్తుంది. అందువల్ల ప్రతి ఒక్కరు త్వరగా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తాసిల్దార్ తెలియపరిచారు.

## ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్‌గా తహ సున్నీసా భేగం




**తిరుపతి కలెక్టరేట్, మే 19 ప్రభాతవార్త** ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్‌గా ప్రముఖ సామాజిక వేత్త, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు తహ సున్నీసా భేగం నియమితులయ్యారు. క్లబ్‌లో మెంబర్‌గా, ట్రైనర్‌గా, క్లబ్ తిరుపతి అధ్యక్షులుగా, లీడర్ షిప్‌గా ఉంటూ రెండు సంవత్సరాల కాలంలోనే తహ సున్నీసా భేగం రీజనల్ ప్రెసిడెంట్‌గా ఎదగడం తాను చేస్తున్న సేవలకు నిదర్శనం. హైదరాబాద్‌లో అసోసియేషన్ ఐకాన్ 2025 కార్యక్రమంలో ఆమెను అసోసియేషన్ జాతీయ, అంతర్జాతీయ బృందం ప్రతినిధులు, సినీ ప్రముఖులు, పలువురు పెద్దలు శాలువ, పుష్పగుచ్చాలతో సత్కరించి నియామక పత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. తహ సున్నీసా భేగం మాట్లాడుతూ ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా తాను నిర్వహించిన సేవలను గుర్తించి తిరుపతిని బెస్ట్ క్లబ్‌గా అవార్డును ప్రకటించి తనకు రీజనల్ ప్రెసిడెంట్‌గా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గంప నాగేశ్వరరావుకు, ప్రతినిధుల బృందం శ్రీనివాస్ సోను, రామచంద్రుడు, శ్రీధర్ వీరమల్ల, జానకి రామ్, నూనె సుదర్శన్, శ్రీధర్ వితలంకు తహ సున్నీసా భేగం ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు

కుప్పం, మే 19 ప్రభాతవార్త: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా మంగళవారం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమం జరగనుంది. ఉదయం స్థానిక పాతపేట వద్ద గల పెద్ద బావి వద్ద అమ్మవారి కళ్లకు తెర తొలగించిన అనంతరం అమ్మవారి శిరస్సును 24గంటలపాటు కుప్పం పట్టణంలో ఊరేగిస్తారు. తదనంతరం బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సు ఆలయంకు చేరుకున్నాక విశ్వరూప దర్శనం ఉంటుంది. అమ్మవారి శిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శన కార్యక్రమాలకు భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తారు. వేలాది భక్తులు అమ్మవారికి జంతుబలులిచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

## అయ్యా..! అంధుడను.. అన్యాయాన్ని అడ్డుకోండి!

### కలెక్టరేట్ ఎదుట రమేష్ ఆవేదన




**చిత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:** అయ్యా జన్మతః అంధుడను. నాకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుని న్యాయం చేయండి అంటూ రమేష్ చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, కూనేపల్లి గ్రామానికి చెందిన కె.రమేష్ అంధత్వ కోటాలో (దివ్యాంగుల కోటాలో) ఏపిసిఓఎస్ ద్వారా ప్రభుత్వ నియామక ప్రక్రియ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కొరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ ప్రైమరీ హెల్త్ సెంటర్లో పోస్టుమార్గం అసిస్టెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఆ మేరకు మెరిట్ ఆధారంగా సదరు ఉద్యోగానికి ఎంపికైనప్పటికీ ఇంటర్వ్యూ దశలోనే డిసిహెచ్‌ఎస్ కళ్ళు కనబడటం లేదు అనే కారణంగా తిరస్కరించినట్లు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయం ఇదివరకు జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ఆవేదన చెందాడు. నా అంధత్వాన్ని నా కుటుంబానికి శాపంగా మార్చవద్దని వేడుకుంటూ న్యాయంగా తనకు లభించాల్సి న ఉద్యోగాన్ని ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇకనైనా చిత్తూరు జిల్లా కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

## సిఎం చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, మే 19 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు బ్రాండ్‌తోనే రాష్ట్రానికి పెట్టుబడులు బారులు తీరుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆటోమొబైల్, సెల్‌ఫోన్, టైర్లు, హీరో గ్రూప్ వంటి సంస్థలు వచ్చాయన్నారు. లక్షలకోట్ల విలువైన ఒప్పందాలతో రాష్ట్రం సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. 2019-24మధ్యలో జగన్‌రెడ్డి పాలనలో పెట్టుబడిదారులు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారన్నారు. జగన్ విధ్వంస పరిపాలన సాగించడంతో రాష్ట్రం వైపు ఎవరూ చూడలేదన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి ముందుకుసాగుతోందన్నారు. ఇప్పటికే 4,95,796కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు ఆయన చెప్పారు. 35వేలమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు.

## మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ఆర్థికసాయం

**కుప్పం, మే 19 ప్రభాతవార్త**



మండలంలోని దేవరాజపురంలో ఆదివారం నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచనలతో ప్రభుత్వం తరపున సోమవారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజులు ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున ఆర్థికసాయంగా అందించారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ చిన్నారులు మృతి చెందిన విషయం ఎంతో కలచివేసిందన్నారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నేతలు ఎవి రవి, అన్నాదొరై, దివాకర్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ రంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి - కెఇసి వైస్ ఛైర్మన్




**కుప్పంరూరల్, మే 19 ప్రభాతవార్త** టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం కెఇసిలో ఐసిటి అకాడమీ, కెఇసి అధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ మనిషి జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగంగా మారిందన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కొత్త టెక్నాలజీ అని దీనిపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐసిటి అకాడమీ ఆర్‌ఎం నగేష్ మాట్లాడుతూ ఐఒటి అనేది ఎంతో కీలకమన్నారు. దీనిరాకతో మన జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, టెక్నికల్ శివ గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, హెచ్ఒడి డా॥ కోదండరామయ్య, పిఒ జయకుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## రేపు ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయ ముట్టడి



**తొట్టంబేడు, మే 19 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని ఎన్జీవో కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం గుర్తింపు పొందిన రిజిస్టర్ కాబడిన ఉపాధ్యాయ సంఘాలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, మండల నాయకులు రేపు జరిగే ఉమ్మడి చిత్తూరు జిల్లా డిఈవో కార్యాలయ ముట్టడిని డివిజన్‌లోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈనెల 23వ తేదీన కమిషనరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమండలంలో పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు హాజరయ్యారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా - ఎంపీ గురుమూర్తి

**కేవీబీ పురం, మే 19 ప్రభాతవార్త:**



తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సత్యవేడు నియోజకవర్గం కేవీబీ పురం మండలం ఆధరం గ్రామంలో ఎంపీ నిధులతో రూ.11.64 లక్షల వ్యయంతో నిర్మితమైన ఆర్వో వాటర్ ప్లాంటును ఎంపీ గురుమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో గ్రామస్తులు విన్నవించిన తాగునీటి సమస్యను ఎంపీ గురుమూర్తి నిధులు కేటాయించి పరిష్కరించారని పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ గురుమూర్తికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వాటర్‌ప్లాంటు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. అలాగే మరో సమస్య అయిన కాళంగి రిజర్వాయర్ గేట్ల మరమ్మతు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మి నందకుమార్, కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి(చందు), లాల్‌బాబ్ యాదవ్, తెరణి ధనంజయులురెడ్డి, మోహన్‌నాయుడు, పరశురాముడు, భక్తవత్సలంరెడ్డి, శాస్త్రిరాజు, డేవిడ్, ఎంపీ టీసీ అయ్యప్ప, సర్పంచ్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బుర్ర మాధవి, హేమాద్రి, వైస్ ఎంపీపీలు దేరాల శ్రీనివాసులు, సరస్వతి, వెంకటరత్నం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గౌనిపురం, రాము వర్మ, పిచ్చాటూరు సర్పంచ్ రోసిరెడ్డి, వీరేంద్ర వర్మ, ఎంపీడీవో మాలతి, మెడికల్ ఆఫీసర్ రామ్ నాయక్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కరుణాకర్, మండల ఈవోపీఆర్డీ శ్రీవల్లి, పాతపాళెం హరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరుణ్, అశోక్, మణికంఠ నాగయ్య, తదితర వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## భారత సైన్య పోరాట ఫలితమే ఆపరేషన్ సింధూర్ విజయం



**కేవీబీ పురం, మే 19 ప్రభాతవార్త:** భారతదేశ సైనికుల వీరోచిత పోరాట ఫలితమే ఆపరేషన్ సింధూర్ విజయమని రామాంజులనాయుడు, గోపినాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారంసాయంత్రం రామాంజులనాయుడు, గోపినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేవీబీ పురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. మండలంలోని సహ ప్రజలందరూ జాతీయ జెండాలు చేతపట్టిసాయిబాబా గుడి వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సైన్యానికి మద్దతుగా నినాదాలు చేస్తూ వెళ్లారు. వారు మాట్లాడుతూ భారత సైన్యానికి దేశంలోని ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. అలాగే ఈ యుద్ధంలో మరనించిన వీర సైనికులకు రామాంజులనాయుడు, గోపినాథ్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## హెచ్‌పిగ్యాస్‌అధినేత కుటుంబానికి పరామర్శ

**.శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త**



పట్టణంలోని నాయుడు బిల్డింగ్స్ గోపాల వనంలో నివాసం ఉంటున్న హెచ్‌పి గ్యాస్ అధినేత కాకర్ల ఉదయ్‌శేఖర్ చౌదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. దీంతో మాజీ శాసనసభ్యులు బియ్యపుమధు సూధన్‌రెడ్డి మరియు మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఆయన సతీమణిని పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఉదయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాదనమున్నారాయల్, నియోజకవర్గ యువజన అధ్యక్షులుశ్రీవారిసురేష్,మాజీకౌన్సిలర్‌ఉత్తరాజీశరవణకుమార్, వేలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణవనం ఎంఇఓ-1గా కస్తూరయ్య

**నారాయణవనం, మే 19 ప్రభాతవార్త :**



నారాయణవనం మండల విద్యాశాఖ అధికారి-1గా నాగలాపురం ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి కస్తూరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఇఓ-1గా పని చేసిన ప్రభాకరరాజు గత నెల పదవీ విరమణ పొందారు. ఆ సా ్థనంలో కస్తూరయ ్యను ప్రభుత ్వం నియమించింది. సోమవారం ఎంఇఓ-1 కస్తూరయ్యను ఎంఇఓ-1 జనార్ధన్‌రాజు, పలువురు టీచర్లు, ఎమ్మార్సీ ఇబ్బంది సత్కరించి అభినందించారు.

## సుందరయ్య లాంటి త్యాగధనులు ఎందరయ్య - సీపీఎం

**పుత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:**



పుచ్చలపల్లి సుందరయ్య అలాంటి త్యాగధనులు ఎందరయ్య అని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆటో స్టాండ్ వద్ద ఆయన పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుత్తూరు సీపీఎం నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత తన యవాదస్తిని పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, సుబ్రహ్మణ్యం, పిల్లా నరసింహులు, పురుషోత్తం, జై భీమ్, వెంకటేష్, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జేమ్స్‌పై దాడి చేసిన వారిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**పుత్తూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:**



తిరుపతిలోని శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలలో థర్డ్ ఇయర్ చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్య అని ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్, వారి గ్యాంగ్‌లపై కేసులు క్రిమినల్ నమోదుచేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం, కేవీపీఎస్ విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుచానూరు పోలీసులు రౌడీషీటర్, గ్యాంగ్‌పైన నామమాత్ర కేసు నమోదు చేయడానికి సీపీఎం తీవ్రంగా విచారణ వ్యక్తం చేస్తుందన్నారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సీపీఎం తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్, నాయకులు భాస్కర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## పాత బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోండి

**విజయపురం, మే 19 ప్రభాతవార్త:**

మండలంలో 2018లో చేసిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అప్పట్లో అధికంగా టీడీపీ నాయకులు పనులు చేపట్టడం జరిగింది. 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని కోల్పోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దాంతో చేసిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రావాల్సిన బిల్లుల కోసం సంబంధిత కాంట్రాక్టర్లు ఎన్నో పోరాటాలు చేశారు. ప్రస్తుతం మరల టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్ల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఎస్టీఎఫ్ నిధులు 28 కోట్లు మంజూరు చేశారని తెలిసింది. కానీ అప్పట్లో విజయపురం మండలం తిరుపతి ఈ పరిస్థితిలో ఉండడం ప్రస్తుత చిత్తూరు పరిధిలోకి వెళ్లింది. దీంతో సాంకేతిక సమస్యతో బిల్లులు చెల్లించలేక పోతున్నామని అటు అధికారులు చెబుతుండగా ఇటు కాంట్రాక్టర్లు ఇప్పటికీ పాత బకాయిలకు నోచుకోక పోవడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

## మానవత్వం చాటుకున్న వైసిపి నాయకులు



నిత్యవసర వస్తువులు సహా రూ.10 వేలు సాయం

**వెదురుకుప్పం, మే 19 ప్రభాతవార్త:**

పిడుగు పాటుకు గురై తీవ్రంగా నష్టపోయిన కుటుంబాన్ని మానవతాధృకృధంతో ఆదుకున్న వైసిపి నాయకులకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. మండలంలోని కాపు మొండి వెంకన్న పల్లి పంచాయతీ, బండమీద ఇండ్లు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం, భయానక శబ్దాలతో ఎస్.శ్యామల గంగాధరం దంపతుల ఇంటిపై పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని వరి దాన్యం, బియ్యం, వేరుశెనగ పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ క్రమంలో శ్యామల గంగాధరం దంపతుల ఆవేదన పట్ల చలించిపోయిన నాయకులు మానవతాధృకృధంతో వారికి అవసరమైన నిత్యవసర వస్తువులతో పాటు నగదు రూపేణా రూ.10 వేలు అందజేసి ధైర్యం చెప్పారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే తగిన రీతిన స్పదించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చలం పాలెం సుకుమార్, వైసిపి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మరకాల కుప్పం రామయ్య, మండల యూత్ నాయకుడు బోడిరెడ్డి నరేష్ రెడ్డి, మండల రైతు విభాగం నాయకులు పాతగుంట బొజ్జారెడ్డి, సంతబయలు సర్పంచ్ రాజేశ్వరి పెద్దిరెడ్డి, మాజీ ఎంపిటిసి జయమ్మ, స్థానిక నాయకులు సుబ్బయ్య, మణి, కుప్పెలయ్య, కృష్ణయ్య, చిన్నబ్బ పెదబ్బా, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలి

– పీజీఆర్ఎస్ కు 42 వినతులు – కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, మే 19, ప్రభాతవార్త** వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌కి ఫోన్ ద్వారా 10 మంది సమస్యలు తెలుపగా, 32 మంది నేరుగా వచ్చి కమిషనర్‌కు వినతులు అందజేశారు. శ్రీనివాసపురం వద్ద డ్రైనేజీ కాలువ పనులు చేయాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ నందు నీరు వృథా చేస్తున్నారని, ఒకే సమయంలో నీరు సరఫరా చేయాలని, మా ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు తొలగించాలని, భవానీ నగర్ నందు డ్రైనేజీ కాలువ మరమ్మత్తులు చేపట్టాలని, గెస్ట్ లైన్ డేస్ హోటల్ సమీపంలో మాస్టర్ ప్లాన్ రోడ్డులో భూమి కోల్పోయాను టిడిఆర్ బాండ్ ఇప్పించాలని, సాయి విష్ణు లేఔట్ నందు తుడా రోడ్డులో ఆక్రమణ నిర్మాణాలు తొలగించాలని, రైల్వే స్టేషన్ వద్ద తమ బంక్ తొలగించారు, బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన ఏర్పాటు చేసుకుంటానని కోరారు, వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి నాయకులు కోరారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎక్కడా మురుగునీరు ఆగకుండా, చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, ఏసిపిలు బాలాజి, మూర్తి సర్వేయర్ కోటేశ్వర రావు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీ నేతని పరామర్శించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 19 ప్రభాతవార్త ః**



రామచంద్రాపురం మండలంలోని సి. రామాపురం పంచాయితీ నందు వైఎస్ఆర్‌సీపీ పార్టీ నాయకుడు మునికృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తన కుడికాలి మోకాలుకు ఆపరేషన్ జరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ద్వితీయ కుమారుడు, వైఎస్ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మునికృష్ణారెడ్డి ఇంటికి వెళ్ళి ఆయన యోగక్షేమాలను తెలుసుకుని ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనకు సమాచారం ఇవ్వాలని సూచిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వెళ్ళి పరామర్శించిన వారిలో పలువురు పార్టీ నేతలు, స్థానికులు ఉన్నారు.

## జేమ్స్ పై జరిగిన దాడి హేయమైన చర్య...

**రేణిగుంట మే 19 ప్రభాతవార్త**



విద్యార్థి జేమ్స్ పై జరిగిన దాడి హేయమైన చర్యగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ అభివర్ణించారు. దళిత విద్యార్థి జేమ్స్ పై హత్యాయత్నం జరిగిందని, హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ స్టార్ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ రావు, అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, ప్రముఖ దళిత నాయకుడు తాళ్లపాక దాము తదితరులు సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు వినతి పత్రం సమర్పించారు. తిరుపతి నగరం ఆధ్యాత్మిక నగరమని తిరుపతిలో రౌడీ షీటర్ల వల్ల శ్రీవారి ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని నేతలు అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దళిత నాయకులు మురళి, గిరి, డాక్టర్ సుధాకర్, ధన శేఖర్, జయరాం, శ్రీను, ఇంద్రముని, రమేష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా దళిత విద్యార్థి పై జరిగిన దాడిని అఖిలభారత యువజన సంఘం తిరుపతి పార్లమెంటరీ కార్యదర్శి కన్జాక్షి కుమార్, రేణిగుంట మండల కన్వీనర్, చంద్ర వేలు సంయుక్తంగా అన్నారు.

## ఛలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

**శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన జరిగే ఛలో విజయవాడ కార్యక్రమానికి సంబందించి గోడపత్రికలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్‌కు ఉద్యోగులు హాజరుకావాలని కోరుతూ మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏపిజిఈఏ తాలూకా అధ్యక్షురాలు శాంతిదుర్గ, కార్యదర్శి శ్రీనాథ్‌లు మాట్లాడుతూ అన్ని శాఖలకు అన్ని తరగతులు వారికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రభుత్వ గుర్తింపు పొంది, రాష్ట్ర సివిల్ సర్వీస్‌జాయింట్ కౌన్సిల్ నందు శాశ్వత సభ్యత్వం కలిగిన ఏకైన ఉద్యోగ సంఘం ఏపిజిఈఏ ఒక్కటే అన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ షేక్ బాషా, ఎస్‌టిఓ ఈశ్వరయ్య, ఎంపిడిఓ సురేంద్రబాబు, రామకృష్ణ, రమేష్, ఇతర సభ్యులు హాజరై గోడపత్రికలను ఆవిష్కరించారు.

## నూతన ప్రెస్‌క్లబ్ ఏర్పాటు

**శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గంను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడుగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా జయశ్యాం, గోపి, నత్తం హరిబాబు, వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.ధనశేఖర్, పిఆర్‌ఓ ఈశ్వర్ పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## మండల పార్టీ అధ్యక్షుడుగా మునిరాజనాయుడు

**తొట్టంబేడు, మే 19 ప్రభాతవార్త**



మండల టిడిపి అధ్యక్షుడిగా మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళ మునిరాజనాయుడును ఏకగ్రీవంగా నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు అందాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మునిరాజ నాయుడును దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. మండలంలో సమస్యలపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు తనకు తెలియజేస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటానని ఎంఎల్ఏ తెలిపారు. అలాగే సుదీర్ఘంగా తెలుగుదేశంపార్టీ అభివృద్ధికి కృషిచేసిన గాలిమురళీనాయుడును దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, యువ నాయకుడు కన్నలిప్రతాప్‌రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ వాడపల్లిజయచంద్రనాయుడు, బోను పల్లి మాజీ సర్పంచ్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సిడబ్ల్యుఎస్ఎన్ సర్వే...
## ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించుటయే



**తిరుపతిరూరల్, మే19 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించుటకు సిడబ్ల్యుఎస్ఎన్ సర్వే చేస్తున్నట్లు ఐఇ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముత్యాలరెడ్డిపల్లిలోని సీతమ్మనగర్‌లో సిడబ్ల్యుఎస్ఎన్ సర్వే చేసారు. విభిన్న సామర్థ్యాలు కలిగిన పిల్లల అభ్యాసాన్ని, విద్యా సెట్టింగులలో పాల్గొనడానికి సులభతరం చేయడానికి ప్రత్యేక మద్దతు అవసరమని తెలిపారు. సిడబ్ల్యుఎస్ఎన్‌లో వైకల్యాలు, అభ్యాస ఇబ్బందులు లేదా ఇతర ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

## బీరు బాటిల్‌తో గుర్తు తెలియని వ్యక్తి దాడి

**తిరుపతిరూరల్, మే19 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం మ్యాంగో మార్కెట్ ఎదురుగా ఆటోస్టాండ్ వద్ద హరి (34) అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి బీరు బాటిల్‌తో పొడిచి గాయపరిచాడు.గాయపడిన హరిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్ సి.ఐ చిన్న గోవిందు తెలిపారు. కార్వేటినగరం మండలం, ఉత్తనూరు గ్రామానికి చెందిన అరకోణం హరికి తాగుడు అలవాటు ఉన్నందున భార్యతో విడిపోయి తన 6సంవత్సరాల కూతురుతో వేరు కాపురం ఉంటున్నాడు. మూడురోజుల క్రితం పద్మావతిపురం ఏరియాలో మద్యం సేవించే సమయంలో ఓ వ్యక్తితో పరిచయమయ్యాడు. అతనితో కలిసి మద్యం సేవించి, అతడితో గొడవ జరిగింది. జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న అతడు సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో మ్యాంగో మార్కెట్ ఎదురుగా వున్న ఆటోస్టాండ్ వద్ద హరి కూర్చుని ఉండగా బీరుబాటిల్ దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు 108లో రుయాకు తరలించారు. అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, అతని స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి విచారిస్తున్నట్లు సి.ఐ చిన్నగోవింద్ తెలిపారు.

## ఘనంగా నీలం సంజీవ రెడ్డి జయంతి

**తిరుపతి విద్య, మే 19 ప్రభాతవార్త**



భారత ఆరవ రాష్ట్రపతి, విశ్వవిద్యాలయ స్థాపనలో కీలక పాత్ర పోషించిన నీలం సంజీవ రెడ్డి 112వ జయంతిని సోమవారం ఎస్వీయూలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్, ఉద్యోగులు పరిపాలనా భవనం ఎదుటగల నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆయన దార్శనిక నాయకత్వం విశ్వవిద్యాలయానికి పునాది వేయడమే కాకుండా భవిష్యత్ తరాలకు విద్యాపథాన్ని కూడా రూపొందించారని, ఆయనకు రుణపడి ఉన్నామని తెలిపారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఇంజనీర్‌ఇన్చార్జి తాండవ కృష్ణ, అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆవాసీయ బాలిక కేంద్రాన్ని సందర్శించిన సమగ్ర శిక్ష అధికారులు

**తిరుపతి విద్య, మే 19 ప్రభాత వార్త**



తిరుపతి జీవకోనలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ బాలికా విద్యాలయ పాఠశాలను సోమవారం సమగ్ర శిక్ష జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయ అధికారి డాక్టర్. చంద్రశేఖర్ నాయుడు, జిల్లా అసిస్టెంట్ ఏ.ఎల్.ఎస్ సమన్వయకర్త మీనాక్షి, జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ డాక్టర్. సుధాకర్ లు పాఠశాలను సందర్శించి పిల్లలకి అందిస్తున్నటువంటి భోజనం, వసతి సదుపాయాలు, పాఠశాల పరిసరాలు, పరిశుభ్రత లాంటి అంశాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేసి రుచి, నాణ్యతను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ హేమ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖుర్‌ఆన్ వినటం కాదు: చదవటం నేర్చుకోవాలి!

**శ్రీకాళహస్తి, మే 19 ప్రభాతవార్త**



దివ్యఖుర్‌ఆన్‌ను వినటం వదలివేయటం కాదు. చదవటం నేర్చుకోవాలని సోమవారం రామచంద్రాపురంలోని జామియా దారుల ఉలుం మహమ్మదీయ ఉర్దు మద్రసా నుంచి మొదటగా దివ్య ఖుర్‌ఆన్ బైహార్ట్ చేసిన హాఫీజే ఖుర్ ఆన్‌లను అభినందించారు. సుమారు 4 సంవత్సరాల పాటు ఈ మద్రసాలో చదివిన విద్యార్థిని అభినందించారు. సోమవారం ఉదయం జల్సా ఏర్పాటు చేసారు. ఈ జల్సాకు వ్యవస్థాపకులు హాఫీజేఖుర్‌ఆన్ నసీం అఖ్తర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా హఫీజ్, హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్, హాఫీజే ఖుర్‌ఆన్ మహమ్మద్ అలి పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ నేడు సమాజంలో సంప్రదాయ విద్య అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దివ్యఖుర్ ఆన్ పఠనం ఎంతో అవసరం అన్నారు. శ్రీకాళహస్తిలోని చిన్నారులను సంప్రదాయవిద్యను అందించుటకు మద్రసాలువెలుస్తున్నాయని, అక్కడ నుంచి హాఫీజే ఖుర్ ఆన్‌లు తయారు కావటం గమనించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దిశ దెశ నిర్దేశం చేసారు

## శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఏడవ సంగీతోత్సవం

**పాకాల, మే 19, ప్రభాతవార్త**



పాకాల మండలంలో సోమవారం జరిగినటువంటి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఏడవ సంగీతోత్సవంనకు ముఖ్య అతిథిగా హాజరైన పులివర్తి సుధా రెడ్డి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, మహిళలు. అనంతరం పాకాల రైల్వే ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన ఏడవ సంగీతోత్సవాన్ని అధ్యంతం తిలకించిన పులివర్తి సుధా రెడ్డి. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, మరియు కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిన్నగొట్టిగల్లు మండల టీడీపీ అధ్యక్షుడిగా బెల్లంకొండ

**భాకరాపేట, మే 19, ప్రభాతవార్త:**



చిన్నగొట్టిగల్లు మండల టీడీపీ అధ్యక్షుడిగా బెల్లంకొండ మురళి, ప్రధానకార్యదర్శిగా మదన్మోహన్‌ను తిరిగి రెండవసారి ఎన్నుకున్నట్టు మురళి తెలిపారు. గతంలో నేను పార్టీకి చేసిన సేవలను గుర్తించుకొని అధ్యక్ష భాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు.

## డాలర్‌ని కలిసిన చిన్నగొట్టిగల్లు జనసేన అధ్యక్షుడు



**భాకరాపేట, మే 19, ప్రభాతవార్త** టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, డాలర్స్ గ్రూప్ అధినేత తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డిని చిన్నగొట్టిగల్లు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు దూది జస్వంత్ కుటుంబ సమేతంగా కలిసి శుభాకాంక్షలుతెలిపారు. జస్వంత్ మాట్లాడుతూ తుడా చైర్మన్ అయిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు.

## టిడిపి మండల అధ్యక్షుడుగా తిరుమల రెడ్డి

ప్రధాన కార్యదర్శిగా గిరిబాబు, ఉపాధ్యక్షులుగా మోహన్ మురళి, గిరిధర్ రెడ్డి

**రామచంద్రాపురం, మే 19 ప్రభాతవార్త:**



తెలుగుదేశం మండల అధ్యక్షుడుగా రాయలచెరువు పేటకు చెందిన మేకల తిరుమల రెడ్డి రెండవ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్లో మండల సంస్థాగత ఎన్నికలు జరిగాయి. తిరుపతి రూరల్ మండలానికి చెందిన గణపతి నాయుడు, భాస్కర్ రెడ్డి, మునిశేఖర్ పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడుగా తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావిళ్ళవారిపల్లికి చెందిన గిరిబాబు, ఉపాధ్యక్షులుగా పుల్లమనాయుడు కండ్రిగకు చెందిన తానికొండ మోహన్ మురళి, సి.రామాపురంకు చెందిన కొట్టే గిరిదర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నడవలూరుకు చెందిన కమలాకర్ రెడ్డి, పెద్దినాయుడు కండ్రిగకు చెందిన రాఘవేంద్ర నాయుడు, నూతుగుంట పల్లికి చెందిన తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, కార్యదర్శులుగా సి.రామాపురంకు చెందిన రవిప్రసాద్, నూతుగుంట పల్లికి చెందిన పంతల వెంకటేష్ నాయుడు, గంగిరెడ్డిపల్లికి చెందిన వాసు యాదవ్, కోశాధికారిగా కమ్మపల్లికి చెందిన మధుసూదన్ నాయుడును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చినబాబు, తానికొండ కేశవులు, జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, కొట్టే నరశింహారెడ్డి, లెక్కల సురేంద్ర నాయుడు, విజయ్‌కుమార్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి వర్ధంతి



ఓజిలి, మే 19 ప్రభాతవార్త : మండలంలోని ఏనుగువాడ గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆ గ్రామంలో సిపిఎం జెండాను సిపిఎం సభ్యులు చనగ చిన్నయ్య ఆవిష్కరించారు. సుందరయ్య చిత్ర పటానికి సిపిఎం ఓజిలి మండల బాధ్యులు శివకవి ముకుంద పూలమాల వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య ఆస్తులు అన్ని పేద ప్రజలకు పంచిపెట్టిన వ్యక్తి వైద్యం కోసం ప్రజల బాధపడుతున్నారని నెల్లూరులో ప్రజా వైద్యశాలను ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఎంతోమంది కార్యకర్తలను తయారుచేసి పేద ప్రజలకు సేవలు అందించమని చెప్పిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వవర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసులు, ఎం కిష్టయ్య, టి ఈశ్వరయ్య, చిన్న పెంచలయ్య, ఎం సుమతి, ఎం లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పేదల పాలిట పెన్నిధి పుచ్చలపల్లి సుందరయ్య



వెంకటగిరి, మే 19 ప్రభాతవార్త: పుచ్చపల్లి సుందరయ్య పేదలపాలిట పెన్నిదని సిపిఎం నియోజకవర్గం కార్యదర్శి వడ్డీపల్లి చంగయ్య తెలిపారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసిన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆయన కడవరకు పోరాడే రెండు తెలిపారు. ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువలేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, రత్నమ్మ, చిరంజీవి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



గూడూరు, మే 19 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేదవారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేదవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి నప్పుడే గుర్తింపు ఉంటుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి నుండి మంజూరైన 12 లక్షల 90 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

## దయనీయ స్థితిలో వెంకటగిరి మటన్ మార్కెట్



వెంకటగిరిరూరల్, మే19 ప్రభాతవార్త: వెంకటగిరి మున్సిపాలిటి లో ఉన్న మాటన్ మార్కెట్ మరింత దయనీయస్థితిలో వుందని ప్రజలు వాపోతున్నారు. లోపలకి వెళ్ళి మటన్, చేపలు కొనుగోలు చేయలేని దుస్థితిలో దుర్గంద వాసనలు వేదజల్లడంతో చాలా ఇబ్బందికరంగా మారిందరి అంటున్నారు. అంతే కాకుండా మటన్ మార్కెట్ మటన్ విక్రయించుకొనేందుకు గదులు ఉన్న కొందరు వ్యాపారస్తులు కురగాలు మార్కెట్‌లో మాంసం విక్రయించడంతో మహిళలు తీవ్ర ఆవస్థలు పడుతున్నారు. ఆదివారం అయితే అధికం జన సంచారం ఉండటం వల్ల మటన్ మార్కెట్‌లో నడిచి వెళ్ళేందుకు కూడా అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మాంసం మార్కెట్ వేలం 3 లక్షల రూపాయులు నుంచి 4.50 లక్షల వరకు మార్కెట్ వేలం పాటను మున్సిపాటి వేస్తున్న మాంసం మార్కెట్‌లో కనీస వసతులు అయిన మంచి నీళ్ళు కూడా కల్పించక పోవడం దారుణం అంటున్నారు. ఇప్పటికైన మున్సిపాల్ కమీషనర్ చొరవ తీసుకొని మాంసం మార్కెట్‌ను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలంట్నూరు.

## భూసార పరీక్షలు వేగవంతం : ఎఓ

వెంకటగిరిరూరల్, మే 19 ప్రభాతవార్త: మండలంలోని 20 గ్రామ పంచాయ తీలల్లో రైతుల భూములల్లో భూసార పరిక్షలు నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుజాత అన్నారు. రైతులు అందురు గ్రామ సభలల్లో పాల్గొని ప్రభుత్వం అందించే రాయతీలు సద్వినియోగం చెసుకోవాలని తెలియజేశారు.

## యువతను పెడత్రోవ పట్టిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్స్

వెంకటగిరిరూరల్, మే 19ప్రభాతవార్త: అక్రమ సంపాదన కోసం కొందరు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టణ, గ్రామీణ ప్రాంతలల్లో యువతుపావులుగా వాడుకుంటున్నారు. ఇంతో అంతో చదువు కొని ఖాళీగావున్న కొంత మంది యువకులకు డబ్బు ఆశ కలిగించి ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ స్మగ్లింగ్ సాగిస్తున్నారు.

## విద్యానగర్‌లో ఈఏపీ సెట్ పరీక్షలు

కోట,మే 19 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో సోమవారం ఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంబం అయ్యాయి.ఇందులో భాగంగా జిల్లాలోని పలువురు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అభ్యర్థులు కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థులు తో పాటు వారి తల్లిదండ్రులు కూడా రావడంతో కాస్త సందడిగా మారింది. పలువురు తల్లితండ్రులు ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలోని కలియగ తిరుగతూ ఉండటం కనిపించింది.

## కోటలో వర్షం

కోట,మే 19 ప్రభాతవార్త : కోట మండలంతా ఆదివారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వారం రోజులగా వాతావరణం కొద్దిగా చల్లబడింది.ఈ ఏడాది ముందస్తుగా వర్షం కురవరడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూములు దుక్కి ఖరీఫ్‌కు సన్నద్దమవుతున్నారు. మే ఆ ఆఖరి,జూన్ మొదటి వారం నుంచి రైతులకు రాయితీతో వేరు సెనగ విత్తనకాయలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.మరో పక్క రైతులు పెట్టుబడులు కొరకు వడ్డీ వ్యాపారుస్తులను, ఇతర బ్యాంకులు చుట్టు తిరుగుతున్నారు.

## బడి బస్సులు బధ్రమేనా ?

కోట,మే 19 ప్రభాతవార్త : జూన్ 12 వ తేది నుంచి పాఠశాలలు పునం ప్రారంభం కానున్న నేపధ్యంలో ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యా సంస్థలు బస్సులను సిద్ధం చేస్తున్నాయి. బస్సులు సామర్థ్యానికి సంబంధించి తరచూ రవాణా శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు రూ లక్షలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. అయితే బాధ్యతగా ఉండాల్సిన పాఠశాలల యాజమాన్యాల మాత్రం స్కూల్ బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు.ఇలాంటి బస్సులతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుంది.కోట మండలంలోని కొన్ని పాఠశాలల యాజమానుల తక్కువ జీతానికి లైసెన్స్ డ్రైవర్లను నియమిస్తున్నారు. ఇలాంటి వారు ప్రమాదాలు చేసే అవకాశాలు లేకపోలేదు. డ్రైవింగ్ నైపుణ్యం, బస్సు నడిపే విధానం,ట్రాపిక్ నిబందనలు, విద్యార్థులు విషయంలో కూడా డ్రైవర్లకు అవగాహన కల్పించిన తర్వాతనే వారికి బస్సులు అప్పగించాల్సి ఉంటుంది. అయితే అలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిచిన దాఖలాల్లేవు. గతంలో కూడా కోట,వాకాడు మండల లోని పలు స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురై ఉన్నాయి. ఈలాంటి బస్సులపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సింది.

**వివరణ:**

బడి బస్సులు ఫిట్ నేస్‌పై గూడూరు మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ ను ప్రభాతవార్త వివరణ అడగగా నిబంధనలను ఉల్లఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికి ప్రవేటు స్కూల్ యాజమానులకు చెప్పడం జరిగిందన్నారు.

## విద్యానగర్‌లోని యువతి అదృశ్యం

కోట,మే 19 ప్రభాతవార్త : మండలం చెందోడు గ్రామానికి చెందిన ఒ యువతి గత రెండు రోజుల నుంచి కనబడటం లేదని ఆ యువతి తల్లిదండ్రులు కోట పోలీసులకు పిర్యాదు చేశారు. ఆమేరకు యువతి అదృశ్యమైనట్లు కేసు నమాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్. పవన్ కుమార్ తెలిపారు.

## నకిలీ పట్టాలతో కబ్జా చేసారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



వెంకటగిరి, మే 19 ప్రభాతవార్త : మండలంలోని వర్ధనపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిని బోగస్ పట్టాలతో కొందరు కబ్జా చేశారని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎన్నో సంవత్సరం నుండి తాము సాగు చేసుకుంటున్నామని అయితే కొందరు బోగస్ పట్టాలు సృష్టించి వాటిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమి చుట్టూ కూడా కంచ వేశారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. బోగస్ పట్టాలతో వెంకటగిరి పట్టణం గ్రామాల్లో జోరుగా భూ కబ్జాలు జరుగుతున్నాయి. బోగస్ పట్టాలను చూపించి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విలువైన స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు తెలిసింది. పబ్లిక్ పర్పస్ కోసం వదిలిన స్థలాలను కొందరు బోగస్ పట్టాలతో రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఉన్నతాధికారి అయినా చర్య తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## పెళ్లకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ




పెళ్లకూరు మే 19 ప్రభాతవార్త: మండల కేంద్రంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం తిరంగా ర్యాలీ చేపట్టారు ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా చేపట్టిన ఈ ర్యాలీలో తెలుగుదేశం బిజెపి, జనసేన నాయకులతో పాటు మండల అధికారులు ఎంపీడీవో, ఎంఆర్ఓ, ఎంఈఓ మరియు ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ అభిమానులు మరియు గ్రామస్తులు యువకులు, మహిళలు అందరూ కలిసి ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు ఈ ర్యాలీ పెళ్ళకూరు మండల కేంద్రమైన ఎమ్మార్వో ఎంపీడీవో ఆఫీస్ దగ్గర మొదలయ్యి 71 వ నెంబర్ జాతీయ రహదారి నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న యువకులు, మహిళలు త్రివర్ణ పథకాలు చేబుని జై భారత్ జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ యుద్ధంలో అసువులు బాసిన వీర సైనికులకు ఆత్మ శాంతి చేకూరాలని అలాగే పోరాడుతున్న ప్రతి సైనికులకు ఆత్మస్థైర్యం ధైర్యం నింపడం కోసం ప్రతి ఒక్కరు సంఘీభావం తెలపాలన్నారు మండల బిజెపి అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా "మనమంతా ఒక్కటే మేమంతా మీ వెంటే" అని ప్రజలందరూ ఏకమై మన ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు

## పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులు : ఎంపీ



వెంకటగిరి, మే 19 ప్రభాతవార్త : మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్ రెడ్డి అక్రమ అరెస్టులను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టులు పూర్తిగా అప్రజాస్వామికమని, ఆధారాలు లేకుండా, కక్ష పూరితంగా రాజకీయ కుట్రతో ఈ అరెస్టులు జరగడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం, ప్రజల దృష్టిని మరల్చే ఉద్దేశంతో డైవర్షన్ రాజకీయాలు నడుపుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఈ చర్యలను గమనిస్తు న్నారని, ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

## పేటలో అనుమానాస్పదంగా యువకుడు మృతి!



నాయుడుపేట, మే 19 ప్రభాతవార్త: పట్టణంలోని మంగపతినాయుడు నగర్‌లో నివాసముంటున్న పోతుల గణేష్(38)అనే యువకుడు అనుమా నాస్పదంగా మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడునగర్‌లో గణేష్ తనకుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంనుండి నివాసం ఉంటూ మేనకూరు అరబిందో కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో 18వ తేది రాత్రి సుమారు 12 గంటల సమయంలో నిద్రలేచి బాత్‌రూమ్‌కి వెళ్ళి కాలుజారి కింద పడిపోవడం వల్ల మృతిచెందినట్లు భార్య తెలపగా, మృతుడు తల్లిదండ్రులు మాత్రం తమ కుమారుడి మృతిచెందడం వెనుక పలు అనుమానాలు ఉన్నట్లు నాయుడుపేట పోలీసులకు పిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ బాబి తన సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామ నిమిత్తం మృతదేహన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట సిఐ బాబి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మనస్థాపంతో భార్య ఆత్మహత్య!

పెళ్లకూరు, మే 19 ప్రభాతవార్త : మండలంలోని పొనబాక దళితవాడలో ఓ వివాహిత సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు పునబాక దళితవాడలో పైపూరి మురళి భార్య స్వాతి ఇద్దరు కుమారులతో కలిసి ఆటో నడుపుకుంటూ నివాసం ఉంటున్నాడు. ఇటీవల భర్త పై అనుమానంతో భార్య స్వాతి గొడవ పడింది. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరు మధ్యలో గొడవలు జరుగుతూ ఉండేవి. సోమవారం మరో మారు గొడవలు చోటు చేసుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన స్వాతి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన మృతురాలు స్వాతి పిల్లలు కేకలు వేయడంతో ఇంట్లోనే నిద్రించుచున్న భర్తతోపాటు చుట్టుపక్కల ఉన్నవారు గమనించి శ్రీకాళహస్తి ప్రభుత్వాలు ఆస్పత్రికి తరలించడంతో డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు అయితే స్వాతి మృతిపై వాళ్ల బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు దీంతో ఎస్ఐ నాగరాజు భర్త మురళిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు మృతురాలు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట, మే 19 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలో సోమవారం తెల్లవారుజాము నుండి ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురవడంతో పట్టణ,గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతకొంత కాలంనుండి ఎండలు భగభగ మంటూ మండుతూ ఉండటంతో ఎండ తీవ్రతకు తట్టుకోలేక ప్రజలు, పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్న తరుణంలో ఆకాశంలో మార్పులు చోటు చేసుకొని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఎండతీవ్రత నుండి కొంత వరకు ఉపశమనం పొందినట్లైంది. నాయుడుపేట మండలంలో ఎడగారుసాగు చేపడుతున్న రైతులకు ఈ వర్షం కొంత వరకు ఊరటనిస్తుంది.

## పదవులపై ఆకాంక్ష లేదు-రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తా

**-స్థానిక ఎన్నికలలో టిడిపి గెలుపు ప్రతి ఒక్కరి బాధ్యత -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



పలమనేరు,మే 19 ప్రభాతవార్త: ఏనాడు పదవుల కోసం ఆకాంక్షించ లేదని రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ మినీ మహానాడును ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏనాడు పదవుల కోసం పని చేయలేదని రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేశానని తెలిపారు. పార్టీ కార్యక్రమాలలో ప్రతి నాయకులు,కార్యకర్తలు పాల్గొనాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలోకి తీసుకువెళ్ళాలని తెలిపారు.స్థానిక సంస్థగత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం గెలుపుకు కృషి చేయాలని సూచించారు.పదవులు రాకపోయినా క్రమశిక్షణతో పని చేయాలని పార్టీ ప్రతి ఒక్కరి కష్టాని గుర్తించి వారికి పార్టీలో ఉన్నత స్థానం కల్పిస్తుందని తెలిపారు.సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని త్వరలో తల్లికి వందనం, ఉచిత బస్సులతో పాటు అంచలంచెలుగా అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందని తెలిపారు.ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీలను అమలు దిశగా తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు.కార్యకర్తల బలం పార్టీకి బలమని నిజమైన టిడిపి నాయకులు,కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈనెల 27,28,29 కడపలో జరిగే మహానాడు పండుగను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.వి. బాలాజీ, రామచంద్ర నాయుడు, విజయ భాస్కర్ రెడ్డి,కిషోర్ గౌడ.రంగనాథ్, కుట్టి, సోమశేఖర్ గౌడ్,ఆనంద్,నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రససోక్తంగా అశ్వర్థవృక్షములకు కళ్యాణోత్సవం



చౌడేపల్లి, మే 19 ప్రభాతవార్త: కళ్యాణము చూతము రారండంటూ రావివేప చెట్లకు నిర్వహించిన కళ్యాణోత్సవం చూపరులను మంత్ర ముగ్ధులను చేసింది. మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లి రవి అతని సోదరులు ఆరేళ్ళ క్రితం గ్రామ నడిబొడ్డులో గల రావివేపచెట్లకు రచ్చబండ ఏర్పాటు చేసి నాగుల రాళ్ళను ప్రతిష్టించాడు. అప్పటి నుంచి యేటా వాటికి వివాహం చేస్తూవస్తున్నారు. వంశవృద్ధి, సంతాన ప్రాప్తితోపాటు లోకం సుభిక్షంగా వుండాలనే వుద్దేశ్యంతోనే ప్రకృతికి సాక్షాలుగా నిలచిన చెట్లకు పెళ్ళి చేస్తున్నట్లు నిర్వాహకుడు రవి తెలిపాడు. నాగదేవతలకు పంచామృతాభిషేకం, అర్చన, అశ్వర్థ వృక్షములకు కళ్యాణోత్సవం జరిగింది. రవి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతిలాంటి కార్యక్రమాలు జరిగాయి. గ్రామంతోపాటు చుట్టుపక్కలవారు వివాహ మహోత్సవానికి హాజరయ్యారు.

## వరసిద్దుని సన్నిధిలో రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ



కాణిపాకం, మే 19 ప్రభాతవార్త: రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్ సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీదర, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులతో పాటు చిత్తూరు జైళ్లశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగుల సహాయార్ధం స్విమ్స్‌సేవ ప్రారంభం



తిరుపతి హెల్త్, మే 19 ప్రభాతవార్త : స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నుంచి పేషంట్ల వారి సహాయకులకు త్వరితగతిన సేవలు అందించాలని ఉద్దేశ్యంతో వారి సహాయార్థం స్విమ్స్ సేవను ప్రారంభించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వి కుమార్ మాట్లాడుతూ టీటీడీలో కొనసాగుతున్న శ్రీవారి సేవ మాదిరిగానే స్విమ్స్‌లో కూడా స్విమ్స్ సేవను ప్రారంభించినట్లు తెలిపారు. టీటీడీ యాజమాన్యం ఆదేశాల మేరకు ఈ సేవను ప్రారంభించామన్నారు. స్విమ్స్‌లోని 42 విభాగాల్లో ఈ సేవలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ సేవకులు, డాక్టర్లు, నర్సులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శరవేగంగా హౌసింగ్ జియో ట్యాగింగ్ మేళా : కమీషనర్



తిరుపతి కార్పొరేషన్, మే 19 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేపడుతున్నా మని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. జియో ట్యాగింగ్ వెళ్ళే లబ్ధిదారుల వాహనాలను సోమవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో తిరుపతి నగరంలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు చిందేపల్లి, ఎం.కొత్తపల్లి, కల్లూరు, లేఔట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 19,086 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 10,000 వేల మందికి జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ లబ్ధిదారులకు ఈ 19, 20, 21 తేదీలలో మూడు రోజులపాటు 9086 మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హౌసింగ్ డిఈఈ లు మోహనరావు, శ్రీనివాస్, కుమార్, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, సెక్టోరల్ ఆఫీసర్లు, సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## త్రిపుర మాజీ సిఎం విప్లవకుమార్‌దేవ్‌కు సన్మానం



తిరుపతి(రవాణ),మే 19ప్రభాతవార్త: ఆపరేషన్ సింధూర్ విజయవంతంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం విజయవంతమైందని త్రిపుర మాజీ సిఎం, బిజెపి ఎంపి విప్లవకుమార్‌దేవ్ కొనియాడారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కార్యక్రమంలో సోమవారం తిరుపతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తిరుపతి బిజెపి జిల్లా నాయకులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, లోకప్రభాకర్ నాయుడు, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ రాయల్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, విశ్వనాధ్ పాల్గొని ఆయనను ఆత్మీయ సన్మానం చేశారు. బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి దుశ్శాలువతో సత్కరించారు.

## శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుని కళ్యాణోత్సవం



వడమాలపేట, మే 19 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున స్వామివారికి కళ్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారా చార్యులు ఆధ్వర్యం లో అగ్ని హోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వేదమంత్రాలతో మాంగళ్యధారణ చేయించారు. మంగళ హారతులు ఇచ్చారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన మాధవరాజు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, టీటీడీ సిబ్బంది, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో డైరెక్టర్ జనరల్



శ్రీకాళహస్తి రూరల్,మే 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన చారిత్రాత్మక శివాలయం పరశురామేశ్వరాలయంలో సోమవారం డైరెక్టర్ జనరల్ అంజనికుమార్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి స్వాగతం చెప్పారు. వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ మాజి చైర్మెన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.ఏర్పాట్లు బందోబస్తును డివైయస్‌పి శ్రీనివాసరావు, సిఐ శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షించారు.

## మృత్యుంజయినికి షోడషాభిషేకాలు



శ్రీకాళహసిత, మే 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అబిషేకాలు నిర్వహించారు.ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు,గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయ మానంగా అలంకరించి ధూప,దీపనైవేద్యాలను మహ మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## హడావుడి ఎక్కువ... పనేమో తక్కువ!

**- పని చేయని క్యూఆర్ కోడ్లు నగదు చెల్లించినా మొబైల్‌కి రాని మెసేజులు**

**- డిజిటల్ బిల్ చెల్లింపులకు చోటు లేదు, నగదు మాత్రమే వీరి స్వీకరణ**

**- కరెంటు కోతలపై ముందస్తు సమాచారం శూన్యం**

పాకాల, మే 19 ప్రభాతవార్త : పాకాల మండల పరిధిలో ఏపీ ట్రాన్స్కో అధికారుల నిర్లక్ష్యంతో అనునిత్యం వేసవి కాలంలో అనధికారిక కరెంటు కోతలు విడిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారఅని భారతీయ జనతా పార్టీ కొత్తపల్లి వేంకటాద్రి నాయుడు అన్నారు. మరోవైపు తమకు ఇంటికి, షాపులకు నెల వారి కరెంటు బిల్లు మొత్తం యొక్క వివరాలతో కూడిన సమాచారం మొబైల్ ఫోన్లకు కొంత కాలంగా సరిగా మెసేజ్‌లు రావటం లేదు. కనీసం కరెంట్ బిల్లు చెల్లిద్దాము అని తమ బిల్లు పై వున్న క్యూఆర్ కోడ్ సహాయంతో చెల్లించే ప్రయత్నం చేస్తే చాలా మందికి ఏపిఎస్‌పిడిసిఎల్ వారు ఇచ్చిన క్యూఆర్ కోడ్ ప్రింట్ సరిగా లేక స్కాన్ కావడం లేదు. ఈ సమస్య అధికారుల దృష్టికి వెళ్లిన తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు భాహిరంగానే విమర్శిస్తున్నారు. ఆఫీసుకు వెళ్లి బిల్ చెల్లిద్దాం అనుకుంటే నగదు మాత్రమే తీసుకొంటాం ఇక్కడ డిజిటల్ చెల్లింపులకు తావులేదు అంటున్న పాకాల విద్యుత్ శాఖ సిబ్బంది. ఒకవైపు డిజిటల్ చెల్లింపులకు మేము పెద్దపీట వేస్తున్నాం అంటూ నిత్యం ఊదరగొడుతున్న ప్రభుత్వం, కానీ చేతల్లో మాత్రం చర్యలు శూన్యం అంటున్న ప్రజానీకం. ఇప్పటికైనా ఏపీ ట్రాన్స్కో అధికారులు మొద్దు నిద్ర వీడి పరిస్థితిని చక్క దిద్ది విద్యుత్ వినియోగదారులకు అన్ని రకాల డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించే విధంగా మరిన్ని మెరుగైన సేవలు అందించవలసినదిగా ప్రజలు, వెంకటాద్రి నాయుడు ఈ సందర్భంగా ఉన్నతాధికారులను కోరుతున్నారు.